క్లుప్తంగా

పింఛన్‌దారుల సమావేశం రేపు

పార్వతీపురం టౌన్: పింఛన్‌దారుల నెలవారీ సమావేశం రైతుబజారు వెనుక గల పింఛన్‌దారుల భవన సముదాయం వద్ద ఈ నెల 8న ఉదయం 9గంటలకు జరగనున్నట్టు ఆ సంఘం కార్యదర్శి గణపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం సబ్ ట్రెజరీ పరిధిలో గల పింఛన్‌దారులు సమయానికి హాజరు కావాలని కోరారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున మే, జూన్ నెలల సమావేశాలు నిలిపివేయనున్నట్టు తెలిపారు.

స్ట్రాంగ్ రూంల పరిశీలన



స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

పార్వతీపురం టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం కోసం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల భద్రతకు గదులు, భద్రతా దృష్ట్యా చేపట్టాల్సిన చర్యల గురించి సిబ్బందికి ఆదేశించారు. స్ట్రాంగ్ రూం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కావలసిన ఏర్పాట్లు చేశారు. స్ట్రాంగ్ రూంలలో సీసీ కెమెరాల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చే రూట్ మ్యాప్, భద్రత తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని విధులు నిర్వహించాలన్నారు. భద్రత తదితర అంశాలపై కూలంకుషంగా క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

సాలూరు: మున్సిపాలిటిలో ఆదివారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో గల ప్రధాన నీటి సరఫరా కేంద్రం వద్ద మంచినీటిని సరఫరా చేసే ఇన్‌ఫిల్టరేషన్ బావులలో సిల్ట్ తొలగింపు పనులు మరియు మరమ్మతుల పనులు జరుగుతున్న నేపథ్యంలో బురద నీటిని బయటకు పంపే చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ పనుల క్రమంలో ఆదివారం పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

పలువురికి వైద్య పరీక్షలు



శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారిణి కిరణ్మయి

బలిజిపేట: పెదపెంకిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరంలో 255మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి 255మంది హాజరవగా వారికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీధర్, అపర్ణబాల, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరగాలి



ఎల్.ఎల్.పురంలో స్వీప్ ఏక్టవీట్‌పై అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి

పాలకొండ రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపొందేలా ఓటర్లు చైతన్యవంతులు కావాలని మండల ఎన్నికల నోడల్ అధికారి ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని ఎల్.ఎల్.పురం గ్రామంలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పారిసిఫేట్ (స్వీప్ ఏక్టవీట్) కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ విద్యా, అవగాహన, వ్యాప్తి వంటి అంశాలపై దృశ్య రూపంలో వివరించారు. ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే విధానంలో లోపాలు తలెత్తకుండా అవగాహన కల్పించారు. సాంకేతికతపై ఓటరుకు అవగాహన అందించటం ద్వారా ఓటింగ్ శాతం పెంచే అవకాశాలు మెరుగుపర్చటమే లక్ష్యమన్నారు. ఈ క్రమంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఆవశ్యకత, అమలు వలన కలిగే ప్రయోజనాలపై ప్రజల ను చైతన్యపర్చారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ కె. సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అభయ హస్తం పింఛన్ల పంపిణీ

భామిని: మండలంలో అభయ హస్తం పింఛన్లు పంపిణీ శనివారం జరిగింది. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వీటిని అందజేశారు. కార్యదర్శులే నేరుగా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. మండలంలోని 15 సచివాలయాల పరిధిలోని 237 మందికి వీటిని అందజేశారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి



పట్టణంలోని అగ్రహారం వీధిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని 21వ వార్డు అగ్రహారం వీధిలో ప్రజలను కలుసుకుని మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలాలు అందుకున్న పేదలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. అవినీతి రహితంగా పారదర్శక పాలన అందించి, అర్హులైన ప్రతి ఒక్కరికి చెంతకే సంక్షేమ పథకాలు అందించి ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మోసపూరిత హామీలతో టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ఎన్నికలకు వస్తున్నారని, టీడీపీ నేతల మాటలు నమ్మితే మోసపోతారని అన్నారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాల రూపంలో కలిగిన లబ్ధిని ప్రతి లబ్ధిదారుడు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, స్థానిక వార్డుల కన్వీనర్లు సామల లలిత కుమారి, చందాన ఆనంద్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్ సభ్యులు చీకటి అనురాధ, తెలుగు బోదయ్య, సువ్వాడ లావణ్య, రణభేరి చిన్నంనాయుడు, నిమ్మకాయల సుధీర్‌కుమార్, ఎడ్ల త్రినాథ, బొత్స ఆనంద్, జె.దివ్య, పి.జయంతి, కో ఆప్షన్ సభ్యుడు మేరువ వెంకట్రావు, స్టేట్ డైరెక్టర్లు మజ్జి నాగమణి, సీనియర్ నాయకులు పోల సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, వైస్ ఎంపీపీ సిద్ద జగన్నాథరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, స్థానికులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు పూలమాలలతో స్వాగతం పలుకుతున్న బక్కుపేట గ్రామస్తులు

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం...

సీతానగరం: రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి జగనన్నను రెండవ పర్యాయం రాష్ట్ర ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. మండలంలోని శనివారం బక్కుపేటలో మాజీ సర్పంచ్ చుక్క శ్రీదేవి, స్థానిక పార్టీ నాయకులు టి.అప్పారావు, సీహెచ్ శ్రీనివాసరావు, శంకరరావు, మన్మధరావు, కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం ప్రచారం చేశారు. గ్రామంలో ప్రజల కోరిక మేరకు జగనన్న కాలనీ ఇవ్వడం జరిగిందని, దీర్ఘకాలంగా గ్రామ ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు పెడుతున్న కొండగెడ్డ కల్వర్టు లక్షలాది రూపాయిలతో నిర్మాణం చేసామని, ఇంటింటి కుళాయిలు, మెరుగైన మంచినీటి సౌకర్యం, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులు కల్పించామని వివరించారు. అంతకు ముందు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.జయమణి, పార్టీ సీనియర్ నాయకులు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పార్టీ నాయకులు పార్థసారధి, ఎస్ రామకృష్ణ, బి.శంకరరావు, ధనం జయనాయుడు, మన్మధరావు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన

పార్వతీపురం టౌన్: ఓటర్లు తమ ఓటు వినియోగంపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కోరారు. మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామంలో వెలుగు సిబ్బందితో కలసి స్వీప్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ మేరకు క్రమం తప్పకుండా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రిసైడింగ్ అధికారులకు సహాయ ప్రిసైడింగ్ అధికారులకు వివరించడం జరిగిందన్నారు. అలాగే గ్రామ పెద్దలు, బూత్ లెవెల్ అధికారులకు, సచివాలయ సిబ్బందికి వివరిస్తూ వీరందరితో గ్రామాల్లోని అవగాహన ర్యాలీని నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణపురం గ్రామంలో స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం



ములక్కాయవలసలో మావుడి సోదరులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మక్కువ: మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలో ములక్కాయ వలస, మేళాపు వలస, మేళాపువలసకాలనీ, శ్రీదేవి కాలనీలో శనివారం ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. జెడ్పీటీసీ, బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు వచ్చిన మావుడి సోదరులకు మహిళలు ఘన స్వాగతం పలికారు. ములక్కాయవలస, మేళాపువలస గ్రామాల్లో మహిళలు పాటలకు డ్యాన్సులు వేశారు. ప్రచారంలో పార్టీ నాయకులు కోట్ల నారాయణరావు, తేలు శ్రీరాములు నాయుడు, కొత్తూరు శంకరరావు, రెడ్డి కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

వీరఘట్టం: టీడీపీ నేతలు తమపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ వీరఘట్టం మండలంలో వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నారు. గురువారం చిదిమి సచివాలయంలో 15 మంది వలంటీర్లు రాజీరామాలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం కిమ్మి సచివాలయ పరిధిలో ఉన్న కిమ్మి, కొట్టుగుమ్మడ, గడగమ్మ పంచాయతీలకు చెందిన 20 మంది వలంటీర్లు, పి.వి.ఆర్.పురం పంచాయతీకి చెందిన 8 మంది వలంటీర్లు తమ రాజీనామాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధుల్లా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందిస్తున్నామే తప్ప మేమెప్పుడూ రాజకీయాలు చేయలేదన్నారు. తమకు వలంటీరుగా అవకాశం ఇచ్చి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమాజంలో సముచిత స్థానం కల్పించడంతో మేమంతా స్వచ్ఛందంగా పనిచేస్తున్నామన్నారు. మా మనోభావాలను దెబ్బతీస్తూ ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు చేయించడం మమ్మల్ని ఎంతగానో బాధించిందన్నారు.



రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు

శాంతియుత ఎన్నికలకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కృష్ణారావు

పార్వతీపురం టౌన్: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నట్టు పట్టణ సీఐ కృష్ణారావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పాత నేరస్తులతో శనివారం సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బైండోవర్ కేసులు నమోదు చేస్తామని, తమ ప్రాంతాల్లో అల్లర్లకు పాల్పడిన, అల్లర్లు సృష్టించిన కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కోరారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐ అప్పారావు, ఎస్ఐ ఎంవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై వర్క్‌షాప్

సీతానగరం: ప్రకృతిలో పెరిగిపోతున్న కాలుష్య నివారణకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత ఉందని సాహితీవేత్త గంట్యాడ గౌరునాయుడు అన్నారు. జోగింపేట మహిళా కేజీబీవీ విద్యాలయంలో ప్రిన్సిపాల్ జె.సంధ్య ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కాలుష్యం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ఉపాధ్యాయినిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి : ఎమ్మెల్యే



ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం: రోగులకు ఆస్పత్రిలో మెరుగైన సేవలను అందించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం పట్టణంలోని ధన్వంతరీ ఆస్పత్రి, పాథాలజీ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలతో పట్టణంలో ఆస్పత్రిని ఏర్పాటు చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఎం.చాందిని, డాక్టర్ బి.రవికుమార్, ఎం.తిరుపతిరావు, ఎం.అనిల్‌రాజ్‌తో పాటు పట్టణంలోని పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్రీయ రహదారికి మహర్దశ



నాడు: జోగింపేట వద్ద గోతులమయమైన బీటీ రోడ్డు



నేడు: మరమ్మతుల చేసిన రోడ్డు

సీతానగరం మండలంలోని 36వ నంబరు రాష్ట్ర రోడ్డుకు వైఎస్సార్‌సీపీ పాలనలో మహర్దశ పట్టింది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అధ్వానంగా ఉండే ఈ రహదారితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. జగనన్న ప్రభుత్వ హయాంలో లచ్చయ్యపేట నుంచి నర్సిపురం వరకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవతో నిధులు మంజూరై అభివృద్ధికి నోచుకుంది. రహదారి పక్కాగా వేశారు. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– సీతానగరం

మంచి చేసిన జగనన్నను మళ్లీ గెలిపిద్దాం..



ప్రచారంలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

పాచిపెంట: ప్రజలకు మంచి చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తేవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పాచిపెంట మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ ఆధ్వర్యంలో రాజన్నదొర శనివారం ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్నదొరకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో పేదల జీవితాలు మెరుగుపడ్డాయన్నారు. ఆర్థికంగా ఎదిగి మంచిగా బతుకుతున్నారన్నారు. దీనికి జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన సంక్షేమ పథకాలే కారణమన్నారు. ప్రజలకు మంచి చేసిన జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలన్నారు. గత ఎన్నికల్లో మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ప్రచారంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, వైస్ ఎంపీపీ మీసాల నారాయణమ్మ, కొరిపల్లి రవీంద్ర, ఎంపీటీసీ దండి కొండలరావు, జేసీఎస్ కన్వీనర్ టి.గౌరీశ్వరరావు, కూరాకుల కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తమామిడి పార్వతి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మానిపుండు నివారణకు చర్యలు

సీతానగరం: మండలంలో రబీ వరి సాగు చేస్తున్న పొలాల్లో మానిపుండు తెగులు సోకిందని నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని ఏఓ ఎస్.అవినాష్ సూచించారు. మండలంలోని బుడ్డిపేట, లక్ష్మీపురం, చెల్లన్నాయుడువలస గ్రామాల్లో రబీ వరి పంట పొలాలను, బూర్జలో మొక్కజొన్న పంట పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న 360 ఎకరాల్లో, వరి 210 ఎకరాల్లో ఈ పంట నమోదు చేసినట్టు తెలిపారు. మొక్కజొన్న హెక్టారుకు 60 క్వింటాళ్లు, వరికి ఒక హెక్టారుకు 60 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని నిర్ధారించినట్టు పేర్కొన్నారు. వరి పంటలో మానిపండు తెగులు వల్ల దిగుబడి తగ్గే అవకాశం ఉందని దీని నివారణకు కోసం రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.



బుడ్డిపేట పొలంలో మానిపుండు సోకిన వరి చేను

ప్రజారోగ్యమే లక్ష్యం

పార్వతీపురం టౌన్: గ్రామస్తుల ఆరోగ్య భద్రతే ధ్యేయమని డాక్టర్ తిరుమల ప్రసాద్ అన్నారు. మండలంలోని నర్సిపురం గ్రామంలో ఫ్యామిలి ఫిజీషియన్ విధానంలో 67 మంది రోగులకు శనివారం వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు నియమితులయ్యారన్నారు. ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరొకరు ప్రజల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తారన్నారు. గ్రామాల్లో మంచాన పడి ఉన్న వృద్ధులు, గర్భిణులు, బాలింతల ఇళ్ల వద్దే వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. గ్రామాల్లో దాదాపు 13 రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఎనిమిది రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



నర్సిపురం గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ తిరుమలప్రసాద్

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న పబ్లిక్ హెల్త్ ఎస్ఈ గణపతిరావు

సాలూరు: వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ గణపతిరావు తెలిపారు. శనివారం పట్టణానికి వచ్చిన ఆయన స్థానిక కాకులతోట వద్ద మంచినీటి సరఫరా చేసే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. నీటిని శుద్ధి చేయడంతో పాటు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఈ శ్రీరామ్మూర్తి తదితరులు ఉన్నారు.

వృద్ధులకు నేత్ర పరీక్షలు

పార్వతీపురం టౌన్:

ఆరోగ్య సురక్షతో వృద్ధులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కంటి వెలుగు నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి తెలిపారు. పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణపురంలో శనివారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నేత్ర వైద్య పరీక్షలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నేత్ర పరీక్షల్లో నలుగురికి అంతర కుసుమం, 14 మందికి దృష్టి దోషం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని, అలాగే దృష్టి దోషం ఉన్న వారికి ఉచితంగా త్వరలో కళ్లజోళ్లు అందిస్తామని తెలిపారు. సాధారణ వ్యాధులకు మందులతో చికిత్స అందించినట్లు తెలిపారు. కంటి వైద్య సహాయకులు ఉమా మహేశ్వరి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య పర్యవేక్షకులు విజయ తదితరులు పాల్గొన్నారు.



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న, వైద్యుడు నగేష్‌రెడ్డి